ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 163
శుక్రవారం 13 డిసెంబర్ 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్



- గుకేశ్‌కు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు
- మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్
- గుకేశ్ పేరు సుస్థిరంగా నిలుస్తుందన్న ప్రధాని మోదీ

.. వివరాలు 3లో



# వన్ నేషన్ వన్ ఎలక్షన్

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైన కేంద్రం

గతంలో కోవింద్ కమిటీ సిఫారసు

02

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 : జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది.



## జైలులో లగచర్ల రైతుకు గుండెపోటు

- బేడీలతోనే ఆస్పత్రికి తరలింపు
- తెలంగాణ పోలీసులు మరో దారుణం

03

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ

- ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్
- ఢిల్లీలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి
- రాహుల్ గాంధీను కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ
- క్యాబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం

**హైదరాబాద్, డిసెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూ- ర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

మిగతా 2 లో



కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం తెలంగాణకు రావాల్సిన నిధులు, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం వరుసగా కేంద్రమంత్రులను కలుస్తున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం కిషన్ రెడ్డిని కలిశారు. కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పారు. రేవంత్ రెడ్డికి కూడా కిషన్ రెడ్డి శాలువా కప్పారు. అనంతరం ఇరువురు కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ భేటీలో కాంగ్రెస్ ఎంపీలు కూడా పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆ తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆ తర్వాత కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ కానున్నారు.

## రైతుకు బేడీలు వేయడం అమానవీయం



- రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03



## అణు విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నాం

- 60 ఏళ్లలో సాధించలేనిది.. రెండు దశాబ్దాల్లో సాధించాం
- వచ్చే పదేళ్లలో మూడు రెట్లు పెరగనున్న అణుశక్తి సామర్థ్యం
- కేంద్ర అణుశక్తి శాఖ మంత్రి జితేంద్ర సింగ్
- లోక్‌సభలో సమావేశాల్లో ప్రకటన

02

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



- 12 మంది మావోయిస్టులు మృతి

02

## ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో మరో 10 అంశాలు

- 8 2.32 లక్షల దరఖాస్తుల అప్‌లోడ్
- 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకోని వారికీ ఛాన్స్
- సంక్రాంతిలోగా వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- 31వ తేదీలోగా మంత్రి వర్గ విస్తరణ
- మీడియాతో చిట్‌చాట్‌లో పొంగులేటి



**హైదరాబాద్, డిసెంబరు 12 :** ఇందిరమ్మ ఇళ్ల కోసం తీసుకొచ్చిన యాప్‌లో మరో 10 కొత్త అంశాలను చేర్చామని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి వచ్చాక భూ ఆక్రమణలకు పాల్పడిన

మిగతా 2 లో



## జర్నలిస్టును కొట్టడం తప్పే

- మీడియాపై దాడి చేయాలని అనుకోలేదు
- ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది
- మీడియా ముసుగులో నాపై దాడికి అవకాశం ఉందని ఆలోచించా
- జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు బాధపడుతున్నా
- ఆయన నా తమ్ముడు లాంటివాడు
- అతని ఫ్యామిలీ గురించి ఆలోచిస్తున్నా
- నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు?
- నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తా
- జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు
- మరో ఆడియో వదిలిన మోహన్ బాబు

02

## కోర్టులో మతపరమైన పిటీషన్ల నిరాకరణ



.. వివరాలు 2లో

- మతపరమైన స్థలాలపై వ్యాజ్యాలను స్వీకరించకూడదు
- పెండింగ్ కేసులపైనా తీర్పులు ఇవ్వొద్దు!
- దిగువ న్యాయస్థానాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు

## కేసీఆర్ నాయకత్వంలోనే బయ్యారం ఉద్యమం



- అక్కడ పరిశ్రమను ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి
- విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం
- చలికివణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత

03

## పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?



తమకు సమాచారం ఇవ్వకుండానే ఫైనల్ చేస్తారా? సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం

03

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
13 డిసెంబర్
2024







## సోరస్, అదానీ అంశాలపై పార్లమెంట్‌లో గందరగోళం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12 : లోక్‌సభలో గురువారం కూడా గందరగోళం నెలకొన్నది. సభ ప్రారంభమైన క్షణం నుంచి అధికార, విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులు ఉన్నట్లు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ఉద్భృతం చేశారు. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశీకాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్, కాంగ్రెస్ కలిసి పనిచేస్తోందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఒంటి గంట, ఆ తర్వాత రెండు గంటల వరకు సభను వాయిదావేశారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 : జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ to పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ



విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది. నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.

## సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

మొదటి పేజీ తరువాయి

సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

## జర్నలిస్ట్‌ను నేను కొట్టడం తప్పే

**హైదరాబాద్, డిసెంబర్ 12:** జల్‌పల్లిలోని తన నివాసంలోకి మంచు మనోజ్ వెంట చొరబడిన జర్నలిస్ట్‌పై దాడి చేయడం తప్పేనని సీనియర్ నటుడు మోహన్ బాబు అంగీకరిం చారు. మంచు ఫ్యామిలీలో గత ఐదు రోజుల నుంచి వివాదం కొనసాగుతుం డగా.. మంగళవారం రాత్రి గేట్లు తోసుకుంటూ తన అనుచరులు, మీడియా సభ్యులతో కలిసి మంచు మనోజ్ ఇంట్లోకి ప్రవేశించాడు. అదే సమయం లో అక్కడికి వచ్చిన మోహన్ బాబు ముందు మైక్ పెట్టిన ఒక జర్నలిస్ట్.. 'ఈ ఇష్యూపై మీరు ఏం చెప్తారు?' అని ప్రశ్నించారు. దాంతో సహనం కోల్పో యిన మోహన్ బాబు.. ఆ మైక్‌ను తీసుకుని జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ తలకి గాయమై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్ట్‌పై దాడి తర్వాత మోహన్ బాబు కూడా అస్వస్థతకి గురై.. ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన మోహన్ బాబు.. ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో ఫ్యామిలీ వివాదంపై క్లారిటీ ఇవ్వడంతో పాటు జర్నలిస్ట్‌పై దాడి, దానికి గల కారణాన్ని కూడా మంచు మోహన్ బాబు వెల్లడించారు. దాడి ఘటనపై చింతిస్తున్నట్లు కూడా ఆయన చెప్పుకొచ్చారు. "మీడియాపై దాడి చేయాలని నేను అనుకోలేదు. ఆరోజు చీకట్లో ఈ ఘటన జరిగింది. మీడియా ముసుగులో నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా.. జర్నలిస్ట్‌కి తగిలిన దెబ్బకు నేను చాలా బాధపడుతున్నాను. ఆ మీడియా ప్రతినిధి నా తమ్ముడు లాంటివాడు.. అతని ఫ్యామిలీ గురించి నేను ఆలోచిస్తున్నాను. కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించేది ఎవరు? నేను కేవలం సినిమాల్లో మాత్రమే నటిస్తాను. నిజ జీవితంలో నటించను.. ఆ అవసరం కూడా నాకు లేదు" అని మంచు మోహన్ బాబు వెల్లడించారు. 'నా ఇంట్లోకి చొరబడి నా ప్రశాంతతని దెబ్బతీశారు. ఒకవేళ నేను నా ఇంటి గేటు బయట అలా దాడి చేసి ఉంటే నాపై కేసులు పెట్టి అరెస్ట్ చేసుకోవచ్చు. అంతెందుకు నేనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోతా. మా కుటుంబంలోని సమస్యని పరిష్కరించుకోవడానికి ఎవరూ మధ్యవర్తులు అవసరం లేదు. మేము కూర్చొని మాట్లాడుకుని .. సమస్యని పరిష్కరించుకుంటాం" అని మంచు మోహన్ బాబు ధీమా వ్యక్తం చేశారు. "మీడియాలో కేవలం నేను కొట్టిన విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. నిజమే.. నేను అలా కొట్టడం తప్పే. కానీ.. ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలి కదా? నేను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. అవన్నీ వదిలేసి.. కేవలం కొట్టిన విషయాన్నే పదే పదే ప్రస్తావిస్తున్నారు" అని మంచు మోహన్ బాబు మండిపడ్డారు. జల్‌పల్లిలో ప్రైవేట్ బౌన్సర్లతో మంచు మనోజ్, మంచు విష్ణు అక్కడ భయానక వాతావరణ సృష్టించారు. దాంతో ఇప్పటికే ఈ ఇద్దరిపై సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసిన పోలీసులు.. మోహన్ బాబుని కూడా విచారణకి పిలిచారు. కానీ.. తెలంగాణ హైకోర్టు నుంచి డిసెంబరు 25 వరకూ పోలీసుల విచారణ నుంచి మోహన్ బాబు మినహాయింపు తెచ్చుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో మరో 10 అంశాలు

మొదటి పేజీ తరువాయి



వారి వివరాలన్నీ బయటపెడతామని పునరుద్ఘాటించారు. గురువారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సర్వే అధికారుల సిఫార్సు కాలమ్‌ను తొలగించామన్నారు. ఇప్పటి వరకు యాప్ ద్వారా 2.32 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కొంత జాప్యం జరిగినా నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. సంక్రాంతి లోపల వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్వోఆర్ -2024 బిల్లును ఆమోదిస్తామని, చట్టం అమల్లోకి వచ్చాక మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో భూ ఆక్రమణలకు పాల్పడిన వారి చిట్టాను అన్ని ఆధారాలతో బయట పెడతామన్నారు. కొత్త ఆర్వోఆర్ బిల్లులో 1971లో వచ్చిన ఆర్వోఆర్ చట్టంలోని మంచి విషయాలనూ తీసుకున్నామన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ఆర్వోఆర్‌పై సలహాలు ఇవ్వాలని సూచించారు. తాను, సీఎం రేవంత్‌రెడ్డి 80 వేల పుస్తకాలు చదవలేదని, అన్ని పుస్తకాలు చదివిన కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీశ్‌రావు కనీసం 5వేల పుస్తకాలు చదివినా.. వాళ్ల సూచనలు తీసుకునే వాళ్లమని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు సూచనలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పుడు విగ్రహంపై గోల చేస్తున్న వారు.. గతంలో అధికారిక ప్రకటన చేశారా? అని ప్రశ్నించారు. ౨ రైతులకు బేడీలు వేయడం సరైన పద్ధతి కాదని, ఈ ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే వసతి గృహాల్లో ఆహార కల్తీ వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. 14వ తేదీన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులందరూ హాస్టళ్లలోనే భోజనం చేయనున్నామని తెలిపారు.

## అణు విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నాం



**న్యూఢిల్లీ,డిసెంబర్ 12 :** భారత అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గత దశాబ్ద కాలంలో 2014లో 4,780 మెగావాట్ల నుంచి 2024 నాటికి 8,081 మెగావాట్లకు చేరుకుందని కేంద్ర అణుశక్తి శాఖ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2031-32 నాటికి అణుశక్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగి 22,480 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం తొమ్మిది అణు విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, అనేక ఇతర ప్రాజెక్టులు ప్రీ-ప్రాజెక్ట్ దశలో ఉన్నాయని, అణుశక్తి సామర్థ్యాన్ని విస్తరించడంలో భారత్ ముందు వరుసలో ఉందన్నారు. 10 అణు రియాక్టర్లకు పెద్దమొత్తంలో ఆమోదం, పెరిగిన నిధుల కేటాయింపులు, ప్రభుత్వ రంగ సంస్థలతో సహకారం, పరిమిత ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సహా అనేక కార్యక్రమాల వల్ల అణు విద్యుత్ ఉత్పత్తి పెరిగిందన్నారు. గడిచిన 60 ఏళ్లలో సాధించలేనిది, గత రెండు దశాబ్దాల్లో సాధించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగం వంటి వివిధ రంగాలలో అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. అలాగే ఆయన థోరియంపై కూడా మాట్లాడారు. భారత్ దేశంలో 21 శాతం థోరియం నిల్వలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. భారత్ యురేనియంపై ఆధారపడడం తగ్గించాలని చూస్తుందని.. అందుకే భవానీ ప్రాజెక్టు ద్వారా థోరియం నిల్వలను అన్వేషిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. గత 10 ఏళ్లలో భారతదేశం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు అయినట్లు, 2031-32 నాటికి మూడు రెట్లు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2031-32, 22,480 మెగావాట్లకు చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2014 తర్వాత రాజకీయ నాయకత్వం అందించిన ఎనేబుల్ పరిసరాలు కీలకంగా మారినట్లు వెల్లడించారు.

## కోర్టులో మతపరమైన పిటిషన్ల నిరాకరణ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 12 :** దేశ వ్యాప్తంగా పలుచోట్ల వివిధ ప్రార్థనా స్థలాల్లో నిర్వహిస్తున్న సర్వేలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్న తరుణంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని, అలాగే ఎలాంటి ఆదేశాలు జారీ చేయరాదని స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాల చట్టం-1991కి సంబంధించి అనుకూలంగా, ప్రతికూలంగా దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఆయనతోపాటు వివిధ పార్టీల నాయకులు జితేంద్ర అహ్వాద్, శరద్‌పవార్, మనోజ్ కుమార్ ఝా తదితరులు కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. కేంద్రం ప్రతిస్పందన తర్వాత ఇతర పార్టీలు రీజాయిండర్ దాఖలు చేయటానికి మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఆ తర్వాతే ఈ విషయంపై విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ అంశానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల్లోనూ ఎలాంటి తీర్పులు, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని అన్ని జిల్లా కోర్టులు, హైకోర్టులను దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ సందర్భంగా జ్ఞానవాపి, మధుర షాహీ ఈద్గా, సంభల్ మసీదు అంశాలను ప్రస్తావించింది. కేంద్రం తన స్పందనను తెలియజేసే వరకు ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఏదైనా ప్రార్థనా స్థలాన్ని మార్చటాన్ని నిషేధిస్తుంది. అయితే 1947 ఆగస్టు 15న ఉన్న ఏ ప్రార్థనా స్థలం ఏదైనా అలాగే కొనసాగేందుకు అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రార్థనా స్థలాల చట్టం 1991ని పరిశీలిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే విచారణ చేయకుండా ఆదేశాలు జారీ చేయరాదంటూ ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను హిందువుల తరఫున న్యాయవాదులు వ్యతిరేకించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 12మంది మావోయిస్టులు మృతి

**బస్తర్, డిసెంబర్ 12:** ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
13 డిసెంబర్
2024





# రైతుకు బేడీలు వేయడం అమానవీయం

- రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం
- లగచర్ల రైతులకు అండగా ఉంటాం
- గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి
- కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 12 :** గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.



'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

# కేసీఆర్ నాయకత్వంలోనే బయ్యారం ఉద్యమం

### అక్కడ పరిశ్రమను ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి
### విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం
### చలికివణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 12:** బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

## వసతులు కల్పించడంలో సర్కార్ విఫలం

రాష్ట్రంలో గురుకులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.

# 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్

### గుకేశ్‌కు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు
### మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్
### గుకేశ్ పేరు సుస్థిరంగా నిలుస్తుందన్న ప్రధాని మోదీ



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 :** భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యా నన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన గుకేశ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదికగా వారు ట్వీట్ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలిచిన అతి పిన్న వయస్కుడిగా నిలిచినందుకు గుకేశ్‌కు హృదయపూర్వక అభినందనలు... మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్ చేశారు. గుకేశ్ విజయం చారిత్రా త్మకమైనది... ఎంతోమంది యువతకు ప్రేరణనిచ్చేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గుకేశ్ అద్భుతమైన విజయం సాధించారని ప్రశంసించారు. అతడి అ సమాన ప్రతిభ, కృషి, సంకల్పాల ఫలితమే ఈ వి జయమని పేర్కొన్నారు. ఈ విజయం చెస్ చరిత్రలో గుకేశ్ పేరును సుస్థిరం చేయడమే కాకుండా లక్షలాది మంది యువతకు గొప్ప కలలు కనేందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కాగా, చెస్‌కు, భారత్‌కు, డబ్ల్యుసీఏకు, తనకూ ఇది గర్వించదగ్గ విషయమని విశ్వనాథన్ ఆనంద్ పేర్కొన్నారు.

# జైలులో లగచర్ల రైతుకు గుండెపోటు



**హైదరాబాద్, డిసెంబర్ 12:** తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవ ర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిప క్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలి సిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయం లో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్ప డ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుం డానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నా యక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్ల డంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివే దిక సమర్పించాలని ఉన్న తాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్సీ కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.



# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

### డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల
### డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం
### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబర్ 12:** ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు. భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే. అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం%ా% చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయి-ంలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది. ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

# పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

### తమకు సమాచారం ఇవ్వకుండానే ఫైనల్ చేస్తారా?
### సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్, డిసెంబర్ 12 :** పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా? అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా? వేరే రాష్ట్రానికి వెళ్లారా? అని చురక అంటించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 13 డిసెంబర్ 2024





# రోజుకో ప్రకటనతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## భువనగిరి మాజీ ఎంపీ. బూర నర్సయ్య గౌడ్ తీవ్ర విమర్శ

మోత్కూరు, రోమింగ్ న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 100 రోజుల్లో అన్నీ 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు చేస్తాం అని చెప్పి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రోజుకో ప్రకటన రోజుకో మంత్రి చేస్తూ పబ్బాం గడుపుతున్నారని భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బోరు నరసయ్య గౌడ్ ఆరోపించారు. మోత్కూర్ మండల కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు బంధు బంద్ చేశారన్నారు. రైతులకు భరోసా



బందయిందన్నారు. కౌలు రైతులకు భరోసా 15000 మాటే లేదని విమర్శించారు.

రైతు కూలీలకు 12000 వేలు ఉత్తముచ్చటగా మిగిలిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళలకు 2500 ఎటుపోయాయన్నారు. డిగ్రీ చదువుతున్న అమ్మాయిలకు స్కూటీలు ఏమయే రేవంత్ రెడ్డి మరిచిపోయిండా అని ఆయన దుయ్యబడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎటుపోయిందని ప్రశ్నించారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీడిక్లరేషన్ ఊసులేదన్నారు. హైద్రాబాద్ యూత్ డిక్లరేషన్ మరిచిపోయారన్నారు. 6 గ్యారెంటీ పేరుతో అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రోజుకో మాట పూటకో ముచ్చట చెప్పి ప్రజలను మభ్యపెడుతు న్నారు...తక్షణమే ఇచ్చిన హామీలు అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.

# బైక్ ర్యాలీ ముగింపు ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ బూర నర్సయ్య





సూర్యాపేట, రోమింగ్ న్యూస్: తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ ముగింపు సభకు గురువారం ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్. కాంగ్రెస్ పార్టీ 6గ్యారెంటీలతో 66 అబద్ధాలు చెప్పి 420 మోసాలు చేసి అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి

ప్రజలకు మొండి చేయి చూపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సోనియాగాంధీ ఫోటో సంతకంతో ఉన్నటువంటి బాండ్ పేపరుని ప్రజలకు పంచారు కానీ అందులో ఏఒక్కటి అమలు చేయలేకపోయారన్నారు.

రైతులకు రైతుబంధు,రైతు భరోసా వూసే లేదన్నారు.కౌలు రైతులకు దిక్కులేదన్నారు. మహిళలకి మహాలక్ష్మి 2500 రూపాయలు, డిగ్రీ చదువుతున్న అమ్మాయిలకు స్కూటీలు

- కళ్యాణ లక్ష్మీ తులం బంగారం మాటేలేదు.
- చీకట్లు నింపిన గృహ జ్యోతి,
- యువ వికాసం ముచ్చటేలేదు
- ఇందిరమ్మ ఇళ్ల లేవు కానీ రోజుకి ఒక్కో మంత్రి ఒక్కొక మాట మాట్లాడుతు పబ్బం గడుపుతున్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చెయ్యాల్సిన హామీలు ఇలా చెప్పుకుంటూ పోతే చెంతాడు అంతా లిస్ట్ ఉన్నది.
- జమిలి కి క్యాబినెట్ ఆమోదం పార్లమెంట్ లో జమిలి ఎన్నికలు బిల్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.
- అతి త్వరలో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయి.
- తుంగతుర్తికి ఇప్పటివరకు సెంట్రల్ నిధులే తప్ప స్టేట్ గవర్నమెంట్ నిధులతో అభివృద్ధి చేసింది ఏమీ లేదు.
- ఇప్పటివరకు మున్సిపాలిటీలకు కూడా సెంట్రల్ నిధులే వచ్చాయి.
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ ని నిండా ముంచింది.
- రేవంత్ రెడ్డి కి హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తూ రోజుకో పది ఇండ్లు కూల్చనిదే ఆయన(డీమాలిష్ మ్యాన్)కి నిద్ర రాదు...
- వచ్చే స్థానిక సంస్థలలో ఎన్నికలలో, మునిసిపాలిటీ, సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలకు ఒక్కసారి బీజేపీ కి అవకాశం ఇవ్వాలని కోరారు.

# యాదగిరిగుట్టలో 16 నుండి ధనుర్మాసోత్సవాలు

### డిసెంబర్ 16 నుంచి మారినున్న గుట్ట గుడి దర్శన వేళలు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 16 నుండి వచ్చే ఏడాది జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 16 నుండి జనవరి 14 వరకు ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 5:45 గంటల వరకు ప్రధానాలయ అంతర ప్రాకార ఉత్తర భాగంలో అమ్మవారిని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి 'తిరుప్పావై' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జనవరి 13న రాత్రి 7 గంటలకు గోదా కల్యాణం, 14న ఉదయం 11:30 గంటలకు 'ఓడి బియ్యం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఓడిబియ్యం కార్యక్రమంతో ధనుర్మాస ఉత్సవాలకు అర్చకులు పరిసమాప్తి పలకనున్నారు.

**డిసెంబర్ 16 నుంచి మారినున్న గుట్ట గుడి దర్శన వేళలు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శన వేళలు డిసెంబర్ 16 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 14 వరకు 30 రోజులపాటు ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఆలయ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహన అధికారి భాస్కరరావు ప్రకటించారు. ఆలయాన్ని ఉదయం మూడున్నర గంటలకు తెరుస్తామని చెప్పారు. మూడున్నర గంటల నుండి నాలుగు గంటల వరకు సుప్రభాతం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు తిరువారాధన, బాల భోగం, ఆరగింపు, ఐదు గంటల నుండి 5:45 వరకు తిరుప్పావై సేవా కాలం, తీర్థప్రసాదాల వితరణ 5:45 గంటల నుండి 6:45 గంటల వరకు స్వామివారికి నిజాభిషేకం, ఉదయం 6:45 నుండి 7:15 వరకు సహస్రనామార్చన, 7:15 నుండి సర్వదర్శనములు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 5:45 గంటల వరకు శ్రీ స్వామివారి ఆలయ ముఖ మండపం పైన ఉత్తర భాగమున గల హాలులో అమ్మవారిని వేయించి తిరుప్పావై కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

# నేడు గుట్ట మండలంలో పర్యటించనున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం పర్యటించనున్నారు. ఇందులో భాగంగా మొదట మధ్యాహ్నం 12:30 గంటలకు యాదగిరిగుట్ట ఆలయానికి చేరుకుని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 1:45 గంటలకు మండలంలోని కాచారం ప్రభుత్వ స్కూల్ లో విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్ కిట్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ధర్మారెడ్డిగూడెంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ కు హాజరుకానున్నారు. అనంతరం భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించి హైదరాబాద్ తిరుగు ప్రయాణం కానున్నారు.

# పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఇందిరమ్మ ఇండ్ల కోసం చేపట్టిన మొబైల్ యాప్ సర్వేను సజావుగా, పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గురువారం కలెక్టర్ హనుమంతరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు.? సర్వే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.? ఇప్పటివరకు ఎంత మంది వివరాలను సేకరించారు.? అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలని ఆఫీసర్లను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వివరాలను సేకరించి ఆన్ లైయలో జాగ్రత్తగా అప్ లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఏమైనా సందేహాలు ఉంటే గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శిని, మున్సిపాలిటీల్లో వార్డు అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నవీన్ కుమార్, విలేజ్ సెక్రటరీ నరేష్, కారోబార్ కట్కం శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఎరుకల సుధకు రాజకీయ బిక్ష పెట్టిందే గొంగిడి దంపతులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధా ఆమె భర్త ఎరుకల హేమేందర్ గౌడ్ కు రాజకీయ బిక్ష పెట్టిందే ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతులు అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ బీరయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్లలో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతులు ఎక్కడ అవినీతికి పాల్పడలేదని, నిరంతరం ప్రజాసేవ కోసమే పని చేశారని గుర్తుచేశారు. కానీ మున్సిపల్ చైర్ పర్సన్ సుధా భర్త హేమేందర్ గౌడ్ తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పందుల పేరు, కోతుల పేరు చెప్పుకొని హేమేందర్ గౌడ్ మున్సిపల్ లో లక్షల రూపాయల బిల్లులు పెట్టి డబ్బులు స్వాహా చేశారని ఆరోపణలు చేశారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన సుధా హేమేందర్ ను యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గా గొంగిడి దంపతులు చేస్తే వాళ్ళనే విమర్శించడం తగదన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కానుగు బాలరాజు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్ లు గొంగిడి దంపతులను విమర్శించే ముందు తమ స్థాయి ఏంటో గుర్తుపెట్టుకోవాలని సలహా ఇచ్చారు. ఆలేరు అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తే వ్యక్తిగతంగా విమర్శించడం వాళ్ళ విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిట్ట వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి ఆరె శ్రీధర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటం రాజు, కౌన్సిలర్లు బూడిద సురేందర్, ఆవుల మమత సాయి, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు వాసం రమేష్, పట్టణ కార్యదర్శి శిఖ శ్రీనివాస్, చిత్తర్ల బాలయ్య, బండ రామస్వామి, బరిగె జానీ, గ్యాదపాక క్రాంతి, దండబోయిన వీరేష్, బండి వాసు, గుణగంటి బాబురావు, కాంటేకార్ పవన్, పాండవుల భాస్కర్, షేక్ దావూద్, నజీర్ తదితరులు ఉన్నారు.

# చందేపల్లి పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేసిన బొప్పిడి సువర్ణ మల్లారెడ్డి



మోటకొండూర్, రోమింగ్ న్యూస్: మోటకొండూర్ మండలం చందేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వంత నిధులతో యూనిఫామ్ ( 50 డ్రెస్ లను ) లను కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గణపతి ఆలయ ధర్మకర్త బొప్పిడి సువర్ణ మల్లారెడ్డి విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు యూనిఫామ్ లను అందజేయడం చాలా సంతోషంగా ఉందని, పాఠశాలకు ఎలాంటి అవసరాలు ఉన్న తన వంతు సాయం అందజేస్తానని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మన చందేపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఏం విజయ, జి మనీశ్రీ మరియు ప్రైమరీ స్కూల్ మాజీ చైర్మన్ బోట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
13 డిసెంబర్
2024



# ఖబర్దార్.... రౌడీ మోహన్ బాబు

- మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయండి
- మీడియాపై దాడిని ఖండిస్తూ మల్కాజిగిరిలో జర్నలిస్టుల ర్యాలీ.
- రౌడీ మోహన్ బాబు బే షరతుగా క్షమాపణ చెప్పాలంటూ జర్నలిస్టుల ధర్నా....
- రాచకొండ కమిషనరేట్ ఎదుట నిరసన తెలిపిన మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ సభ్యులు
- ఖబర్దార్ మోహన్ బాబు... అంటూ జర్నలిస్టుల నినాదాలు....
- అయ్యప్ప మాల లో ఉన్న విలేఖరి పై దాడి... నీ నాశనానికి హెచ్చరిక...
- మల్కాజ్గిరి చౌరస్తా నుండి నేరేడ్మెట్ రాచకొండ కమిషనరేట్ కార్యాలయం వరకు జర్నలిస్టుల ర్యాలీ....





మల్కాజిగిరి,డిసెంబర్ 12, రోమింగ్ న్యూస్: రౌడీ మోహన్ బాబు ఖబర్దార్ మీడియా జోలికే వస్తావా... వార్తల కవరేజ్ కోసం వచ్చిన విలేకరి పైనే దాడి చేస్తావా అంటూ ఒక్కసారిగా జర్నలిస్టులు అంత ఏకమై ర్యాలీలు నిరసనలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే మోహన్ బాబు ఇంటి గొడవ రోడ్డు పాలైంది... గత మూడు రోజులుగా తండ్రి కొడుకుల కొట్లాట ప్రజలంతా చూస్తూనే ఉన్నారు. ఇట్టి విషయంపై మంచు మనోజ్ పిలుపుమేరకు మీడియా వర్గాలు ఈ గొడవను కవరేజ్ చేసేందుకు సంఘటన స్థలానికి వెళ్లారు. న్యూస్ కవరేజ్ చేస్తున్న విలేఖరి పైన ఉన్మాదంతో రెచ్చిపోయిన మోహన్ బాబు ఒక్కసారిగా లోగో తీసుకొని అయ్యప్ప మాల లో ఉన్న విలేకరిపై దాడి చేశారు. అంతేకాకుండా తన నోటికి వచ్చిన మాటలతో దుర్భాషలాడుతూ గెంటివేశారు. ఈ సమయంలో అతని బౌన్సర్లు కూడా మీడియాపై దాడి చేయడంతో ఇద్దరు జర్నలిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన జర్నలిస్టులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఖబర్దార్ మోహన్ బాబు... శిక్ష పడే వరకు వదిలిపెట్టం

ఉన్మాదంతో రెచ్చిపోయిన రౌడీ మోహన్ బాబును యావత్ జర్నలిస్టులు క్షమించరని మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నల్లతీగల బాలరాజ్, గౌరవ సలహాదారులు గడ్డమీది లవ కుమార్ గౌడ్, సునీల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి యాతం విశాల్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు శ్రీకాంత్ లు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ బాబు ఇంటిగుట్టు రోడ్డు పాలు అయిన తర్వాతే మీడియా వారు కవరేజ్ కోసం వెళ్లారు తప్ప ఇంట్లోకి చోచ్చుకొని వారి ఇంటి గుట్టును బయటకు లాగలేదు. ఇట్టి విషయాన్ని గమనించకుండా మదంతో ఊగిపోయిన మోహన్ బాబు మీడియా పై దాడి చేయడం అనేది సిగ్గుచేటు అని దీనికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. ఎంతో అనుభవం కలిగిన మోహన్ బాబు ఈ విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని గట్టిగా ప్రశ్నించారు.

**కేసు నమోదు కాదు.... తక్షణమే అరెస్టు చేయండి....**

మీడియాపై దాడి చేసిన రౌడీ మోహన్ బాబుపై కేసు నమోదు చేసి పోలీసులు కాలయాపన చేస్తున్నారని తక్షణమే అతడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో జర్నలిస్టులు మల్కాజ్గిరి చౌరస్తా నుండి నేరేడ్మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయం వరకు ప్ల కార్డులతో... మోహన్ బాబు డౌన్ డౌన్... మీడియాపై దాడి సిగ్గు సిగ్గు... మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలంటూ... నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం రాచకొండ కమిషనరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించిన జర్నలిస్టులు తక్షణమే మోహన్ బాబును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుకు వినతి పత్రం కూడా అందజేశారు.

అయ్యప్ప మాలలో ఉన్న విలేకరిపై దాడి నీ నాశనానికి....

అయ్యప్ప మాల ఎంతో పవిత్రమైనది... 41 రోజు నియమ నిబంధనలతో క్రమశిక్షణతో నల్ల బట్టలు, మెడలో అయ్యప్ప మాలను ధరించి పవిత్రంగా పూజలు చేస్తారు. అలాంటి వ్యక్తి విధి నిర్వహణలో భాగంగా వార్తల కవరేజ్ కోసం వస్తే దాడి చేయడం నీకు సమంజసమా.... ఈ దాడి నీ నాశనానికే అంటూ మాల వేసుకున్న జర్నలిస్టులు మోహన్ బాబు పై తీవ్ర పదజాలంతో హెచ్చరించారు. ఎన్నో పౌరాణిక చిత్రాలు నటించిన మోహన్ బాబు ఇవన్నీ సినిమాల వరకే పరిమితం అని నిరూపించుకున్నావు కదా అని ఘాటుగా విమర్శించారు. తగిన శాస్తి నీకు తప్పదు అని తక్షణమే దాడి చేసిన విలేఖరితోపాటు మీడియా రంగానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. పోలీసులు మీడియాపై దాడిని సీరియస్ గా తీసుకొని తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ 518/2023 నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు సునీల్ రెడ్డి మోహన్ రావు, రవి కుమార్ ,రెహమాన్, సంగమేశ్వర్, కుమ్మరి రాజు, రాజేందర్, ప్రభాకర్, నాగరాజుగౌడ్, జాన్, మహేందర్ ,పరమేష్ యాదవ్,వెంకటరమణ, శివ, దుర్గాప్రసాద్, జ్యోతి కుమార్, లతోపాటు భారీ సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



## పర్యాటక ప్రమోషన్ లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి

**మంత్రి జూపల్లి పిలుపు**





హైదరాబాద్, రోమింగ్ న్యూస్: శాసన సభ వ్యవహారాలపై తెలంగాణ శాసన సభ, శాసన మండలి సభ్యులకు పునశ్చరణ తరగతులు ముగిసిన సందర్భంగా ఇబ్రహీం బాగ్ లోని తారామతి బారాదరి కల్చరల్ సెంటర్ లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు , పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ%ౌ% తెలంగాణ పర్యాటక ప్రమోషన్ లో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని, నెలలో రెండు సార్లు పర్యాటక ప్రాంతాలను సందర్శించి, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని కోరారు. ధ్వంసమైన మన సంస్కృతి, సంప్రదాయాలకు తిరిగి ప్రాణం పోసి వాటిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సంప్రదాయాలు, కళలు మన ఔన్నత్యాన్ని చాటుతాయని , కళలు అంతరించి పోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కథక్, కూచిపూడి, మోహిని అట్టం, ఒడిస్సీ, పేరిణి నృత్యం, ఒగ్గుడోలు, ఫ్యూజన్, కవాలి, గుస్సాడి నృత్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## సృజనాత్మకత పెరిగితేనే భావిశాస్త్రవేత్తలుగా విద్యార్థులు

**విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం విస్తృతం చేయాలి**

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పిలుపు**

**అట్టహాసంగా ప్రారంభమైన సైన్స్ ఫెయిర్**





భువనగిరి, రోమింగ్ న్యూస్: ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, భావి శాస్త్ర వేత్తలుగా తీర్చి దిద్దాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు.గురువారం రాయగిరిలోని విద్యా జ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన-2024-25 మరియు జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డు ప్రదర్శన -2023-24 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల న చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లలో చదువుతున్న విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎం తో ఉపయోగపడుతుంది అన్నారు. విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలంటే ఉపాధ్యాయులు బోధించే బోధనలు వాస్తవిక దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకొని బోధించాలన్నారు. పేద ప్రజలు, రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణల దిశగా ప్రయోగాలు జరగాలన్నారు. పర్యావరణ హితమైన స్వచ్ఛ ప్రయోగాల ద్వారా ఇంధనాలను ఉత్పత్తి చేసే విధంగా ఆవిష్కరణలు ఉండాలన్నారు దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలను ప్రోత్సహించడం, వారు బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం మన అందరి కర్తవ్యం అని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించారు. ప్రదర్శించిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినీ విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతోపాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సృజనాత్మకత నైపుణ్యం ను పెంపొందించుకోవాలని అలాగే వినూత్నమైన ఆలోచనలతో ప్రతి ఒక్కరు అలోచించి తమ భావి జీవితానికి పునాదులు వేసుకోవాలని సూచించారు. జిల్లా వైజ్ఞానిక సదస్సులో భాగస్వాములైన విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మన జిల్లా విద్యార్థులు ముందు ఉండాలన్నారు. ఈ సైన్సు ఫెయిర్ లో 95 ఇన్స్పైర్ ప్రాజెక్ట్ లు, 190 బాల వైజ్ఞానిక ప్రాజెక్ట్ లు ప్రదర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, సహాయ సంచాలకులు ప్రశాంత్ రెడ్డి, జిల్లా సైన్సు అధికారి రాజశేఖర్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

**ఈ నెల 14 నుండి డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు**

**పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా**



జనగామ డిసెంబర్ 12: (రోమింగ్ న్యూస్) పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి ఆయన అన్ని మండలాల ఎంఈఓలు, వసతి గృహాల వార్డెన్ లు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి చేపట్టబోయే డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈ నెల 14న జిల్లాలోని (66) విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ముఖ్య అతిథిచే పాఠశాలల పర్యవేక్షణ, 12 నుంచి 12:30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు/విద్యార్థులతో ముఖాముఖి ఉంటుందని, 12:30 నుంచి 1 వరకు డైట్ ప్లాన్ బ్యానర్, హ్యాండ్ బుక్ ఆవిష్కరణ, ముఖ్య అతిథి స్పీచ్ అనంతరం 1 కి మధ్యాహ్న భోజనం ఉంటుందని తెలిపారు.

అందుకు తగిన ఏర్పాట్లను సమన్వయంతో పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని, ఇందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులకు, విద్యార్థినీవిద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా విద్యాసంస్థలను పరిశుభ్రంగా ఉంచాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, నాణ్యమైన పదార్థాలతో శుచిరుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించుటకు కృషి చేస్తోందని, ప్రణాళికా బద్ధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విజయోస్తు కార్యక్రమంలో భాగంగా వచ్చే పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, స్టడీ అవర్స్ లో అన్ని సబ్జెక్టులపై పూర్తిస్థాయిలో విద్యార్థులచే సాధన చేయించాలని, ప్రతిరోజూ స్లిప్ టెస్ట్ లను నిర్వహించాలని, ఏదైనా సబ్జెక్టులో బలహీనంగా ఉన్న విద్యార్థులపై మరింత ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గణితం, హిందీ ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులలో వారు రాణించేందుకు అదనపు కృషి చేయాలని, అభ్యాస దీపికను పూర్తిచేయాలని, అందుకు తగ్గట్లు యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని, డిసెంబర్ 31 వరకు పదవ తరగతి సిలబస్ ను పూర్తిచేయాలని, వసతి గృహాల్లోని వార్డెన్ లు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే జనవరిలో పదవ తరగతి విద్యార్థులకు 50 శాతం సిలబస్ తో మాక్ టెస్ట్ నిర్వహిస్తామని, ఫిబ్రవరిలో వంద శాతం సిలబస్ తో మరో మాక్ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలల స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేసి, సబ్జెక్టుల వారీగా బలహీనంగా ఉన్న విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఏం చేయాలి.. 10/10 సాధించ గల విద్యార్థులు ఎంత మంది.. అనే తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అందుకు తగినట్లుగా ఎజెండాను రూపొందించుకొని, క్రమబద్ధంగా షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు.

**అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతను సరైన విధంగా నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, వంట సరుకులు, వండే విధానం, వంట పదార్థాలలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, రిజిస్టర్ ల నిర్వహణలో ఎటువంటి అలసత్వం పనికిరాదని, నూకలు, పురుగులు లేని బియ్యాన్ని వండాలని, వంట మనుషులు అప్రాన్ ధరించాలని, జుట్టుకు మాస్క్ వేసుకోవాలని, బల్లులు, బొద్దింకలు లేకుండా సరుచూసుకోవాలని, నాణ్యతతో పాటు పరిమాణం కూడా చాలా ముఖ్యమని సూచించారు. జిల్లాలో గల మొత్తం 66 రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో కంప్లయింట్ బాక్స్ లను ఏర్పాటు చేయాలి.

సోమవారం నుంచి జిల్లాలో గల మొత్తం 66 రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో కంప్లయింట్ బాక్స్ లను ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనుల నేపథ్యంలో డిసెంబర్ 31 లోగా మిగిలిన పాఠశాలల్లో గల పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**బాలికా సాధికారత క్లబ్ లలో గ్రీవెన్స్ బాక్స్ ఉండాలి.**

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్ లను(%+అతీశ్రీ జష్ట్రఅశ్రీఎ జుఎజూశీషవతీఎవఐ జశ్రీబఎం%) ఏర్పాటు చేయాలని, వాటిలో గ్రీవెన్స్ బాక్స్ ఉండాలని, పోలీసు, సంక్షేమం, లీగల్ సెల్, ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కమిటీ ఉంటుందని, అందులో ఈ గ్రీవెన్స్ లో వచ్చే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, సంక్షేమ పాఠశాలల అధికారి విక్రమ్, ట్రైబల్, బీసీ, సంక్షేమ, మైనారిటీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహాల వార్డెన్లు, ఎంఈఓలు, హెడ్ మాస్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం 13 డిసెంబర్ 2024







# సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన


## పలువురు కేంద్రమంత్రులతో భేటీ

## కేంద్రమంత్రి కిషన్? రెడ్డితో సీఎం భేటీ

## రాహుల్? గాంధీతో భేటీ అయ్యే అవకాశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 12 :** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్? రెడ్డితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?ను కూడా రేవంత్ రెడ్డి కలిశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్? పార్టీ అగ్రనేత రాహుల్? గాంధీతో పాటు సీనియర్? నేతలను కూడా ఆయన కలిసే అవకాశం ఉంది. పీసీసీ కార్యవర్గం ఎంపిక, మంత్రివర్గ విస్తరణ అంశాలపై అధిష్ఠానంతో చర్చించే ఛాన్స్ ఉంది. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్? ఎంపీలతో ఇవాళ రాత్రి రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి పార్లమెంట్?లో ప్రస్తావించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది.

# ఖమ్మంలో వృద్ధ దంపతుల హత్య మిస్టరీని చేధించిన పోలీసులు



**ఖమ్మం,డిసెంబర్ 12 :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జరిగిన వృద్ధ జంట హత్య మిస్టరీని పోలీసులు చేధించారు. ఓ నిందితుడి ఫోన్‌కాల్ ఆధారంగా పక్షం రోజుల వ్యవధిలోనే పోలీసులు ఈకేసులో పురోగతి సాధించారు. వృద్ధ దంపతులను బంగారం, డబ్బు కోసమే హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. జగ్గయ్యపేటకు చెందిన నేర ప్రవృత్తి కలిగిన ఓ నిందితుడితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కొత్త కొత్తూరులో 15 రోజుల కిందట వృద్ధ దంపతులు యర్ర వెంకటరమణ, కృష్ణకుమారి తమ సొంతింట్లో దారుణహత్యకు గురయ్యారు. హత్యకు సంబంధించి ఆనవాళ్లు లభించకుండా నిందితులు పక్కా పథకం ప్రకారం వ్యవహరించటంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. మూడు నెలల క్రితం వృద్ధ దంపతులు అనారోగ్యం బారిన పడి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ సమయంలో వారిని దొంగల ముఠా సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఫోన్ నంబర్ తీసుకున్నారు. కొత్త కొత్తూరులోని ఆ దంపతుల భవన సముదాయంలో అద్దెకు ఇళ్లు ఉన్నాయని తెలుసుకుని ఇద్దరు మహిళలు తరచూ అక్కడికి వెళ్లేవారు. మహిళలకు దంపతులు పలుమార్లు తమ ఇంట్లోనే భోజనం పెట్టడంతో వీరంతా కలిసిపోయారు. అతి త్వరలోనే ఇంట్లో అద్దెకు దిగుతామని వృద్ధులను నమ్మించారు. ఇందులో భాగంగానే నవంబర్ 27న రాత్రి నలుగురు వచ్చి దంపతులను మట్టుబెట్టారు. ఈ కేసును ఛేదించేందుకు సీపీ సునీల్‌దత్ ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాల్ డేటా, సీసీ కెమెరాల పరిశీలనకు ప్రత్యేక బృందాలను నియమించారు. సుమారు పది రోజుల పాటు ఎలాంటి ఆధారాలు లభించలేదు. నలుగురిలో ఓ నిందితుడు చివరగా వెంకట రమణకు ఫోన్ చేసిన నంబర్ ఆధారంగా కేసు దర్యాప్తును పోలీసులు ప్రారంభించారు. నిందితుడు తన ఫోన్‌తో పాటు మిగిలిన ముగ్గురి ఫోన్లను ఒక్కొక్కటి ఒక్కోచోట పడేయటంతో కాల్ డేటా, జీపీఆర్ఎస్‌తో మరికొన్ని ఆధారాలు సేకరించారు. మూడు ఫోన్లలో ఓ ఫోన్ నంబర్ జగ్గయ్యపేట వాసి పేరిట నమోదవటంతో పూర్తి వివరాలు రాబట్టారు. పోలీసు శాఖలో అతడిపై కేసుల వివరాలు సేకరించారు. సదరు వ్యక్తిపై 2012లో హత్య కేసు నమోదైందని తెలుసుకోవటంతో తమదైన శైలిలో దర్యాప్తు సాగించారు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నిందితులను గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశముంది.

# ఇండియాకు స్వర్ణ పథకం సాధించిన జనగామ బిడ్డ







## దివ్యాంగురాలైనా ఆత్మవిశ్వాసంతో విజయం

## కంబోడియాలో జరిగిన త్రో బాల్ పోటీలో కృష్ణవేణికి గోల్డ్ మెడల్

## జనగామలో కృష్ణవేణికి కలెక్టర్ ఘన సన్మానం

జనగామ, డిసెంబర్ 12 :(రోమింగ్ న్యూస్) పుట్టుకతో దివ్యాంగురాలు అయినప్పటికీ మొక్కవోని ధైర్యం, ఆత్మవిశ్వాసంతో విద్యతోపాటు ఇతర రంగాలలో కూడా ప్రావీణ్యత సంపాదించిన జనగామ జిల్లాకు చెందిన కృష్ణవేణి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుంది. జనగామ జిల్లాలోని స్టేషన్ఘన్పూర్ మండల్ విశ్వనాధపురం గ్రామానికి చెందిన మాచర్ల కృష్ణవేణి పుట్టుకతోనే దివ్యాంగురాలు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు అదాలత్ లోని (హన్మకొండ) దివ్యాంగుల బాలికల వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న ప్రభుత్వ సుబేదార్ హైస్కూల్లో విద్యను అభ్యసించింది. చిన్నప్పటి నుండి చదువులో, ఆటలలో రానిస్తూ ఉన్నత చదువుల మీద మక్కువతో ఎంబీఏ ఎంఫిల్ పూర్తిచేసి ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీలో కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్లో (పి. హెచ్. డి) చదువుతుంది. కృష్ణవేణిలో ఉన్న ప్రతిభను గుర్తించిన సింగారపు బాబు పి సి ఐ నెంబర్ ( పారా ఒలంపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ) పారా త్రోబాల్ లో 2021 నుండి ఆయన ద్వారా శిక్షణ తీసుకోవడం జరిగినది. జాతీయ స్థాయిలో పలు పోటీల్లో ఉన్నత ప్రతిభను కనబరిచిన కృష్ణవేణిని అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు తగిన మెలకువలు నేర్పి ఈ నెలలో డిసెంబర్ 5, 6, 7 తేదీల్లో కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో తనదైన శైలిలో ప్రతిభ కనబరిచి మన భారతదేశానికి స్వర్ణ పథకం సాధించి పెట్టింది. గోల్డ్ మెడల్ సాధించిన కృష్ణవేణి గురువారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శాలువాతో , పుష్పగుచ్చాలు అందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తనను చిన్ననాటి నుండి అన్ని విషయాలలో ప్రోత్సహిస్తున్న పెద్దలకు, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన బాబు గారికి, సన్మానిస్తూ ప్రోత్సహించిన జనగామ కలెక్టర్ గారికి ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని శ్రీమతి ఫ్లోరెన్స్, జిల్లా క్రీడల విభాగం అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా సంక్షేమ సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్

## కుప్పకూలిపోయి రెండు ముక్కలైన విమానం



**టెక్సాస్,డిసెంబర్ 12:** అమెరికాలో దక్షిణ టెక్సాస్ హైవేపై బుధవారం ఓ చిన్న ట్విన్ ఇంజిన్ ప్రొపెల్లర్ విమానం మూడు కార్లను ఢీకొట్టింది. ఆ విమానం హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ప్రయత్నించిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఒక చిన్న విమానం దక్షిణ టెక్సాస్ హైవేపై క్రాష్ ల్యాండింగ్ కు ప్రయత్నించింది. అంతకు ముందు తక్కువ ఎత్తులో ఎగురుతూ, రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీ కొట్టింది. అనంతరం హైవే పై ఉన్న ఒక బ్రిడ్జిని ఢీ కొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆ చిన్న విమానం రెండు ముక్కలైంది. విమాన శకలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడడంతో ఆ హైవే పై భారీగా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. టెక్సాస్ లోని విక్టోరియాలోని స్టేట్ హైవే లూప్ 463పై మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా, ముగ్గురికి ప్రాణాపాయం తప్పింది. నాలుగో వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక కేంద్రానికి తరలించారు. హైవేపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు ముందు విమానం తక్కువగా ఎగురుతూ పలు వాహనాలను ఢీకొట్టింది. విమానం ప్రమాదానికి ముందు రోడ్డుపైకి దిగుతున్న దృశ్యాలను సోషల్ మీడియా ఫుటేజీలో చిత్రీకరించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, పలువురికి గాయాలయ్యాయని విక్టోరియా పోలీస్ డిపార్ట్ మెంట్ డిప్యూటీ పోలీస్ చీఫ్ ఎలిన్ మోయా తెలిపారు. ఎమర్జెన్సీ రెస్పాండెంట్స్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం చేసి శిథిలాలను తొలగించారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ కు దారితీసిన సంఘటనలను క్రోడీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నేషనల్ ట్రాన్స్పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్టీఎస్బీ)కి సమాచారం అందించి మరింత లోతుగా దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు. ఆ విమానం క్రాష్ ల్యాండ్ కావడాన్ని కొందరు వాహనదారులు తమ స్మార్ట్ ఫోన్స్ లో చిత్రించి, సోషల్ మీడియా లో పోస్ట్ చేశారు. విమానం అకస్మాత్తుగా దిగడం, తరువాత కూలిపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని సాక్షులు వర్ణించారు. "అది అలా పడిపోవడం చూస్తే భయం వేసింది" అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక వ్యక్తి చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత తాను విమానం వద్దకు వచ్చానని, పైలట్ స్పృహలో ఉన్నాడని, కానీ అతడిని బయటకు తీయలేకపోయానని వివరించారు.

# మోహన్‌బాబు మీడియాకు క్షమాపణలు చెప్పాలి

- మోహన్‌బాబు కొడుకు మీడియాను పిలిచాడు
- అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది
- మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది
- కానీ మీరే ఇంటి ఇష్యూని పబ్లిక్‌లో పెట్టేశారు
- బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, డిసెంబర్ 12 :** మంచు ఫ్యామిలీ వివాదం గంటకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ వివాదంలోకి రాజకీయ నాయకులు ఎంట్రీ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మంచు ఫ్యామిలీ ఇష్యూ గురించి కీలక వ్యాఖ్యాలు. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలని సూచించారు. రాజాసింగ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.'మోహన్ బాబు మీడియాకి క్షమాపణలు చెప్పాలి. మోహన్ బాబు కొడుకు మీడియాను పిలిచాడు. అందుకే మీడియా ఇంటి లోపలికి వెళ్లింది. మీ ఇంటి ఇష్యూ మీ ఇంట్లో పెట్టుకుంటే బాగుంటది.. కానీ పబ్లిక్‌లో పెట్టేశారు. మోహన్ బాబుకి నా సజెషన్.. ఈ ఇష్యూని ఇలానే వదిలేస్తే చాలా పెద్దది అవుతుంది. మీరు మీడియాకి క్షమాపణలు చెప్పాలి.. గాయాలైన రిపోర్టర్‌ను వెళ్లి కలవండి' అని బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సూచించారు. మోహన్ బాబు దాడిలో గాయపడ్డ జర్నలిస్ట్ రంజిత్‌కు యశోద ఆస్పత్రిలో సర్జరీ జరిగింది. జైగోమాటిక్ బోన్‌ను వైద్యుల బృందం సరిచేసింది. కంటికి, చెవికి మధ్య మూడు లెవెల్స్‌లో ఫ్రాక్చర్లు అయ్యాయి. జైగోమాటిక్ ఎముక మూడు చోట్ల విరిగింది. ఫ్రాక్చర్లు అయిన చోట సర్జరీ చేసి.. స్టీల్ ప్లేట్ అమర్చారు యశోద ఆస్పత్రి వైద్యులు. రంజిత్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు చెబుతున్నారు. అటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మోహన్ బాబు.. డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్న మోహన్‌బాబుకు.. వైద్యులు చికిత్స అందించారు. అటు మోహన్ బాబుపై పహాడీ షరీఫ్ పోలీసులు అటెంప్ట్ కేసు నమోదు చేశారు. ఓ టీవీ ఛానెల్ ప్రతినిధిపై దాడి ఘటనలో మోహన్ బాబుపై మొదట బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుపై లీగల్ ఒపీనియన్ తీసుకున్న తెలంగాణ పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో కాస్త ఊరట లభించింది. పోలీసుల ఎదుట విచారణ నుంచి మినహాయింపు ఇస్తూ.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



జారీ చేసింది. మంచు కుటుంబ వ్యవహారం, మీడియాపై మోహన్ బాబు దాడి ఘటనపై విచారణకు హాజరుకావాలని రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. మీడియాపై దాడికి సంబంధించి మోహన్ బాబుపై కేసు కూడా నమోదైంది. అయితే.. పోలీసుల నోటీసులపై మోహన్ బాబు హైకోర్టును ఆశ్రయించారు. మంచు ఫ్యామిలీ వివాదం నడుస్తున్న నేపథ్యంలో.. సోషల్ మీడియాలో మంచు లక్ష్మి మరో పోస్ట్ చేశారు. ప్రపంచంలో ఏదీ మీది కానప్పుడు.. ఏం కోల్పోతారని భయపడుతున్నారంటూ ట్వీట్ చేశారు. మోహన్ బాబుపై కేసు నేపథ్యంలో మంచు లక్ష్మి పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ పోస్టు చేశారనే చర్చ జరుగుతోంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
13 డిసెంబర్
2024






# ఆస్ట్రేలియాతో అమీతుమీ
# తేల్చుకోనున్న టీమిండియా




ఆస్ట్రేలియాతో ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్ ఇరు జట్లకు కీలకమైంది. ఈ సిరీస్‌పై పట్టు బిగించాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు అత్యవసరం. ఈ క్రమంలోనే మూడో టెస్ట్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలను టీమిండియా మేనేజ్‌మెంట్ రెడీ చేస్తోంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్‌గానే ఆడించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. రెండో టెస్ట్‌తో రీ ఎంట్రీ ఇచ్చాడు. కానీ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో రోహిత్‌ను మిడిలార్డ్‌లో ఆడించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ సైతం ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. దాంతో రోహిత్ శర్మను ఓపెనర్‌గానే కొనసాగించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చూస్తే ఈ విషయం అర్థమైంది. ఈ నెట్ సెషన్‌లో రోహిత్ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్నాడు. ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్‌తో పాటు బౌన్సర్లను ప్రాక్టీస్ చేశాడు. స్టంప్ లైన్ డెలివరీలను కూడా ఆడాడు. ప్రస్తుతం రోహిత్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ రెండు సార్లు మాత్రమే 20 ప్లస్ రన్స్ చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉండగా.. 8 సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడితే.. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.

## షమి పునరాగమనంపై అనిశ్చితి




భారత క్రికెట్ జట్టుకు ఒక ముఖ్యమైన సమస్యగా మహ్మద్ షమీ ఫిట్‌నెస్ నిలుస్తోంది. అతని మోకాలి వాపు సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కష్టంగా మారింది. రోహిత్ శర్మ కూడా 100% ఫిట్‌నెస్ హామీ లేకుండా షమిని జట్టులోకి తీసుకోలేనని వెల్లడించారు. అయినప్పటికీ, అతని పునరాగమనంపై నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. 2024లో భారత క్రికెట్ జట్టుకు ఎదురయ్యే అనేక సమస్యల్లో మహ్మద్ షమీ ఫిట్‌నెస్ ఒకటి. భారత జట్టులో పేస్ బౌలింగ్ బలోపేతం అవసరం కావడంతో, షమీ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతం అతని మోకాలి సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కుదరట్లేదు. రోహిత్ శర్మ, షమీ గురించి మాట్లాడుతూ, అతనిపై 100% ఫిట్‌నెస్ హామీ ఇచ్చే వరకు జట్టులోకి తీసుకోడానికి ఇష్టపడం లేదని పేర్కొన్నాడు. షమీ పై ఒత్తిడి లేకుండా, మునుపటి ఆట తర్వాత అతను ఎలా తిరిగి పుంజుకుంటాడో, నిపుణులు అతనిని పర్యవేక్షిస్తున్నారని కూడా చెప్పారు. రోహిత్ గమనించినట్లుగా, షమీకి 100% ఫిట్‌నెస్ సాధించాక మాత్రమే జట్టులో చేరే అవకాశం ఉంటుంది. షమీ ప్రస్తుతం బెంగాల్ జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడుతున్నాడు, కానీ ఆయన మోకాలి వాపు సమస్యలు కొనసాగుతున్నాయి. షమీ, ఐపీఎల్, రంజీ ట్రోఫీ వంటి పోటీ క్రికెట్‌లో తన నైపుణ్యాలను పునఃప్రదర్శించడానికి ప్రయత్నించినప్పటికీ, మోకాలి సమస్యలు అతని పరిమితులను పెంచుతున్నాయి. ఈ సమస్యల కారణంగా, అతని పునరాగమనంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. భారత జట్టు ఇప్పటికే నూతనంగా జట్టులోకి వస్తున్న బౌలర్లతో మ్యాచ్‌లు ఆడుతోంది. అయితే షమీ తిరిగి ఫిట్‌నెస్ సాధిస్తే, అతన్ని జట్టులో సమలిసే అవకాశాలు ఉండవచ్చు. కానీ ఈ సమయంలో, అతని స్థితి పునరాలోచన అవసరం.



## రోహిత్ శర్మను ఓపెనర్‌గా ఆడించే అవకాశం

ఆస్ట్రేలియాతో ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్ ఇరు జట్లకు కీలకమైంది. ఈ సిరీస్‌పై పట్టు బిగించాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు అత్యవసరం. ఈ క్రమంలోనే మూడో టెస్ట్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలను టీమిండియా మేనేజ్‌మెంట్ రెడీ చేస్తోంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్‌గానే ఆడించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. రెండో టెస్ట్‌తో రీ ఎంట్రీ ఇచ్చాడు. కానీ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో రోహిత్‌ను మిడిలార్డ్‌లో ఆడించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ సైతం ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. దాంతో రోహిత్ శర్మను ఓపెనర్‌గానే కొనసాగించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చూస్తే ఈ విషయం అర్థమైంది. ఈ నెట్ సెషన్‌లో రోహిత్ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్నాడు. ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్‌తో పాటు బౌన్సర్లను ప్రాక్టీస్ చేశాడు. స్టంప్ లైన్ డెలివరీలను కూడా ఆడాడు. ప్రస్తుతం రోహిత్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ రెండు సార్లు మాత్రమే 20 ప్లస్ రన్స్ చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉండగా.. 8 సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడితే.. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.

## టెస్ట్ క్రికెట్ ఆడే సామర్థ్యం హిట్ మ్యాన్‌కు లేదు

- ఫ్లాట్ వికెట్‌పై మాత్రమే ఆడగలడు
- సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డారిల్ కల్లినన్



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపై సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డారిల్ కల్లినన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ ఫిట్‌గా లేడని, అధిక బరువుతో ఉన్నాడని విమర్శించాడు. టెస్ట్ క్రికెట్ ఆడే సామర్థ్యం హిట్ మ్యాన్‌కు లేదని అభిప్రాయపడ్డాడు. అంతేకాకుండా రోహిత్ శర్మ ఫ్లాట్ వికెట్‌పై మాత్రమే ఆడగలడని, బౌన్స్‌ను ఆడలేడని తెలిపాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో దారుణంగా విఫలమైన రోహిత్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోనూ అదే వైఫల్యాన్ని కొనసాగిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్.. అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఈ పింక్ బాల్ మ్యాచ్‌లో రోహిత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రోహిత్ శర్మపై డారిల్ కల్లినన్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. 'ఒకసారి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని గమనిస్తే ఇద్దరి మధ్య ఉన్న ఫిజికల్ కండిషన్ ఏంటో అర్థమవుతోంది. రోహిత్ శర్మ అధిక బరువుతో ఉన్నాడు. అతను ఏ మాత్రం లాంగ్ టర్మ్ క్రికెటర్ కాదు. నాలుగు, ఐదు రోజుల టెస్ట్ సిరీస్ ఆడేందుకు రోహిత్ సరైన ఫిజికల్ కండిషన్‌తో లేడు. భారత కండిషన్స్‌తో పాటు ఫ్లాట్ వికెట్స్ మాత్రమే రోహిత్ ఆడగలడు. బౌన్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కోలేడు.'అని డారిల్ కల్లినన్ చెప్పుకొచ్చాడు. అతని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా హాట్ టాపిక్‌గా మారాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియా చెరొక మ్యాచ్ గెలిచాయి. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి గబ్బా వేదికగా మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లోనైనా రోహిత్ శర్మ రాణించాల్సి ఉంది. లేదంటే అతనిపై విమర్శలు ఎక్కువవ్వనున్నాయి.

## హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్

- బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు
- ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్




దశాబ్దానికిపైగా సత్తాచాటిన విరాట్ కోహ్లి, కేన్ విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్‌లను క్రికెట్ ప్రపంచం ఫ్యాబ్-4గా పిలుస్తుంటుంది. అత్యుత్తమ క్రికెటర్ అనే ప్రశ్నకు ఈ నలుగురిలో ఒక్కరి పేరే అత్యధికంగా జవాబుగా వినిపిస్తుంటుంది. అంతటి రీతిలో క్రికెట్ క్షేత్రంలో ఈ యోధులు సత్తాచాటారు. అయితే ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ అత్యుత్తమ క్రికెటర్ అంటూ కుర్రాడు పేరు చెప్పాడు. ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ క్రికెటర్ ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అని పాంటింగ్ పేర్కొన్నాడు. ఫ్యాబ్-4 కాకుండా తొలిసారి కొత్త పేరు తెరపైకి వచ్చింది. 25 ఏళ్ల ఇటీవల బ్రూక్ ఇటీవల టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకాడు. జులై నుంచి టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న జో రూట్‌ను అధిగమించి ఒక్క పాయింట్ ఆధిక్యంతో బ్రూక్ అగ్రస్థానానికి చేరాడు. "ప్రస్తుత టెస్టు బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్‌గా భావిస్తున్నా. అతను చక్కని ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. సొంతగడ్డతో పాటు విదేశాల్లో గొప్ప ప్రదర్శన చేస్తున్నాడు. అతను సాధించిన ఎనిమిది-తొమ్మిది సెంచరీల్లో విదేశాల్లో ఏడు శతకాలు విదేశాల్లోనే బాదడం విశేషం. అతను పరుగులు సాధించే విధానం, క్లాస్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నాను. జనరేషనల్ ప్లేయర్ అయిన అతన్ని గత ఐపీఎల్ వేలంలో దక్కించుకున్నాను. ప్రస్తుత టెస్టు ఫార్మాట్‌లో సత్తాచాటుతున్న బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు" అని రికీ పాంటింగ్ అన్నాడు. గత కొంతకాలంగా అద్భుత ఫామ్ కొనసాగిస్తున్న హ్యారీ బ్రూక్ శతకాలు సాధిస్తున్నాడు. 23 టెస్టులు ఆడిన బ్రూక్ 61.62 సగటుతో 2280 పరుగులు చేశాడు. ఎనిమిది సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఓ డబుల్ సెంచరీ కూడా బాదాడు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ల నుంచి బ్రూక్ ప్రశంసలు అందుకుంటున్నాడు. గత ఐపీఎల్ వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. అప్పటి ఢిల్లీ కోచ్‌గా పాంటింగ్ ఉన్న సంగతి తెలిసిందే.




## ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వన్డే సెంచరీలు

### చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన..!

వన్డే క్రికెట్లో స్మృతి మంధాన దెబ్బకు రికార్డులన్నీ చెల్లాచెదురయ్యాయి. ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కానీ రికార్డును తన ఖాతాలో వేసుకుంది ఈ క్యూటీ. బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన మూడోవన్డేలో ఈ ఘనతను సాధించింది. భారత డాషింగ్ మహిళా బ్యాటర్ స్మృతి మంధాన దుమ్మురేపింది. మహిళా క్రికెట్లో వరల్డ్ రికార్డను నెలకొల్పి శభాష్ అనిపించింది. బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన 3వ వన్డేలో స్మృతి మంధాన ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచులో సెంచరీ (109 బంతుల్లో 105, 14 ఫోర్లు, 1 సిక్సర్ ) సాధించి మంధాన ఎవరికీ సాధ్యం కానీ రికార్డులు తన ఖాతాలో వేసుకుంది. ఒక క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన బ్యార్ గా రికార్డు క్రియేట్ చేసింది. మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 8000 పరుగులను పూర్తి చేసింది. మంధాన ఇప్పుడు అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలుగా రికార్డుల్లోకి ఎక్కింది. కేవలం 28 ఏళ్ల 146 రోజుల వయసులో స్మృతి ఈ ఘనత సాధించింది. 2024లో వన్డే ఫార్మాట్‌లో స్మృతి మంధానకు ఇది నాలుగో సెంచరీ. బెలిండా క్లార్క్, మెగ్ లానింగ్ వంటి చాలా మంది దిగ్గజ ఆటగాళ్లను వెనక్కి నెట్టింది. స్మృతి మంధాన కెరీర్‌లో ఇప్పటివరకు 91 వన్డేల్లో 3812 పరుగులు చేసి, 145 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో 3568 పరుగులు చేసింది. ఇది కాకుండా, మంధాన తన కెరీర్‌లో ఇప్పటివరకు 7 టెస్ట్ మ్యాచ్‌లు కూడా ఆడింది. అందులో ఆమె 629 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా ఘోర పరాజయంపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన ప్రకటనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. బౌలింగ్ లో రాణించామని..ముఖ్యంగా అరుంధతి మంచి ఫెర్మామెన్స్ చూపించిందని చెప్పింది. ఈ టూర్‌లో తను బౌలింగ్, బ్యాటింగ్ చేసిన విధానం నుండి మనం చాలా నేర్చుకోవాలి. మేము తిరిగి వెళ్లి మొత్తం పర్యటనను విశ్లేషిస్తాము. మేము ఎక్కడ తప్పు చేశామో అర్థం చేసుకుంటాము. స్మృతి ఇన్నింగ్స్ అద్భుతంగా ఉంది. మేము కొన్ని చోట్ల మంచి ప్రదర్శన కనబరిచాము, కానీ మేము మా జోరును కొనసాగించలేకపోయాము. భవిష్యత్తులో మేము మరింత కష్టపడాలి అని హర్మన్ ప్రీత్ అన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





# వివాహబంధంతో ఒక్కటైన కీర్తిసురేశ్ -ఆంథోని తటిల్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ కీర్తిసురేశ్ -ఆంథోని తటిల్ వివాహబంధంతో ఒక్కటయ్యారు. సౌతిండియా సంప్రదాయ పద్దతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్లు వేశాడు ఆంథోని తటిల్. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న కీర్తిసురేశ్ దంపతులకు కుటుంబసభ్యులు, ఇండస్ట్రీ ప్రముఖులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వధూవరులిద్దరు మెరిసిపోయారు. కొత్త జీవితాన్ని మొదలుపెడుతున్న క్షణాలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. హ్యాష్‌ట్యాగ్ జత చేసింది కీర్తిసురేశ్. బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్‌తో కలిసి కీర్తిసురేశ్ నటిస్తోన్న బేబిజాన్ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తిసురేశ్‌కు ఇది హిందీలో తొలి సినిమా.






# నయనతారకు మద్రాసు హైకోర్టు నోటీసులు

'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్ ఇటీవలే మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై దావా వేశారు. దీనిపై తాజాగా మద్రాసు హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై జనవరి 8వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు నయన్ దంపతులతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు నోటీసులు జారీ చేసింది. విఘ్నేష్ దర్శకత్వంలో వహించిన 'నానుమ్ రౌడీ దాన్'(2016) సినిమా నయన్ జీవితంలో కీలకం. ఆ సినిమా సమయంలోనే వారిద్దరూ ప్రేమలో పడ్డారు. అందుకే అందులోని సన్నివేశాలను, పాటలను డాక్యుమెంటరీలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో.. దానికి సంబంధించిన ఎన్‌వోసీ(అనుమతి పత్రం) కోసం ఆ చిత్ర నిర్మాతైన హీరో ధనుష్‌ని డాక్యుమెంటరీ మేకర్స్ సంప్రదించారు. రెండేళ్లపాటు పోరాడినా ధనుష్ మాత్రం అందుకు అనుమతి ఇవ్వలేదు. డాక్యుమెంటరీ స్ట్రీమింగ్‌కి వస్తున్న నేపథ్యంలో రీసెంట్‌గా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని మూడు సెకన్ల క్లిప్స్ ఉండటంతో, అందుకు నష్టపరిహారంగా 10కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ నయనతార టీమ్‌కు ధనుష్ లీగల్ నోటీసులు పంపారు. దాంతో మనసు నొచ్చుకున్న నయనతార.. ధనుష్‌కు భారీ లెటర్‌ని రాసింది. ఇందులో ఆయనపై తీవ్ర విమర్శలు చేసింది. దీంతో ఆగ్రహించిన ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయన్ దంపతులపై దావా వేశారు.

# మీడియాకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన సాయిపల్లవి

అగ్ర కథానాయిక సాయి పల్లవి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రేమమ్, ఫిదా, గార్గి సినిమాలతో తనకంటూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా అమరన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ.. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమా చేస్తుంది. అయితే సాయి పల్లవి వెజిటేరియన్ అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ప్రసావించింది. అయితే తాజాగా బాలీవుడ్ రామాయణం సినిమా కోసం సాయి పల్లవి నాన్ వెజ్ మానేస్తుందంటూ తమిళ మీడియా ఒక కథనం ప్రచురించింది. దీంతో ఈ విషయం వివాదం అవ్వగా.. దీనిపై సాయి పల్లవి స్పందిస్తూ.. మీడియాకు వార్నింగ్ ఇచ్చింది. తమిళ అగ్ర మీడియా రామాయణ్ సినిమా గురించి రాస్తూ.. "సాయి పల్లవి ఇప్పుడు బాలీవుడ్‌లో రామాయణం అనే ప్రాజెక్ట్‌లో నటించబోతుంది. దీనికోసం షూటింగ్ ముగిసే వరకు ఎలాంటి నాన్ వెజ్ ముట్టుకోకుడదని తాను నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అలాగే మంసాహారం తినకుండ విదేశాలకు వెళ్లినప్పుడు తనతో పాటు చెఫ్‌ను కూడా వెంట తీసుకువెళుతుంది. ఈ చెఫ్ సాయిపల్లవి కోసం వెజ్ డిన్నర్ తయారు చేస్తారు" అంటూ రాసుకోచ్చింది. అయితే దీనిపై ఘాటుగా స్పందించింది సాయి పల్లవి చాలా సార్లు, దాదాపు ప్రతిసారి.. నా మీద వచ్చే పుకార్లు లేదా తప్పుడు వార్తలను పట్టించుకోను. ప్రతిసారి ఇలా అవుతుంటే మాత్రం స్పందించక తప్పదు. నెక్స్ట్ టైం ఇలాంటి తప్పుడు వార్తలను అగ్ర మీడియాలు కానీ వాటికి చెందిన సోషల్ మీడియా పేజీలు కానీ ప్రచురిస్తే నా తరపు నుంచి చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అంటూ సాయి పల్లవి రాసుకోచ్చింది.





# వైరల్‌గా మంచులక్ష్మి పోస్ట్

మంచు లక్ష్మి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. సందేశాత్మక పోస్ట్‌లు పెడుతుంటారు. వృత్తి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు నెటిజన్లతో పంచుకుంటూ ఉంటారు. అయితే, ప్రస్తుతం మంచు కుటుంబంలో తీవ్ర గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పరిణామాల వేళ మంచు లక్ష్మి పెడుతున్న పోస్ట్‌లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నిన్న తన కుమార్తె నిర్వాణ నవ్వులు చిందిస్తున్న వీడియో షేర్ చేస్తూ.. పీస్ అని క్యాప్షన్ ఇచ్చిన మంచు లక్ష్మి.. ఇవాళ ఓ మోటివేషన్ కొటేషన్ పంచుకున్నారు. 'ఈ ప్రపంచంలో ఏదీ మనది కానప్పుడు.. ఏదో కోల్పోతావనే భయం నీకెందుకు' అంటూ ఓ రచయిత రాసిన సందేశం షేర్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986